సాక్షి ఖమ్మం

శుక్రవారం । 3 । మే । 2024



రైళ్ల రద్దుతో అవస్థలు

పలు రైళ్లను రద్దచేసి, ఇంకొన్నింటిని దారి మళ్లించడంతో దూర ప్రయాణాలకు సిద్ధమైన వారు అవస్థ పడుతున్నారు. IIలో



ఈ ఎన్నికలు క్లిష్టమైనవి..

ఎన్నికలను ఆషామాషీగా తీసుకోకుండా బీజేపీకి గుణపాఠం చెప్పాలని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు తెలిపారు. IIలో

గరిష్టం / కనిష్టం
43° / 30°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. సాయంత్రం వరకు వడగాలులు కూడా వీస్తాయి.

న్యూస్‌రీల్

భానుడి ఉగ్రరూపం

● జిల్లాలో గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు

ఖమ్మంవ్యవసాయం: భానుడి ఉగ్రరూపం దాలుస్తున్నాడు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం నుంచి రెడ్ ఎలర్ట్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం కూడా గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈమేరకు గురువారం మూడు ప్రాంతాల్లో రెడ్ ఎలర్ట్ స్థాయి ఉష్ణోగ్రత నమోదైందని అధికారులు వెల్లడించారు. అత్యధికంగా ముదిగొండ మండలం పమ్మిలో 45.8, బాణాపురంలో 45.5, నేలకొండపల్లిలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక గేట్ కారేపల్లిలో 44.8, ఖమ్మం ప్రకాశ్‌నగర్, వైరాలో 44.7, ఖమ్మం ఖానాపురం, తల్లాడలో 44.5, పెనుబల్లిలో 44.2, తిమ్మారావుపేట, ముదిగొండలో 44.1, మధిర, రఘునాథపాలెంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఉదయం నుంచి సాయంత్రం ఎండ, అర్ధరాత్రి వరకు వడగాలుల ప్రభావం ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత జనం బయటకు వచ్చేందుకు జంకుతుండడంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

డయల్ 100కు 4,483 ఫోన్లు

ఖమ్మంక్రైం: ఆపదలో ఉన్న వారు పోలీసులను సంప్రదించేలా ఏర్పాటుచేసిన డయల్ 100కు ఏప్రిల్ నెలలో4,483 మంది ఫోన్ చేశారని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇందులో 91 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. వీటిలో హత్యాయత్నం, మహిళలపై వేధింపులు, చోరీలు, ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు వంటివి ఉన్నాయని వెల్లడించారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.1.31కోట్లు



బ్యాంకు అధికారులకు నగదు అందజేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈమేరకు 35 రోజుల కాలానికి గాను రూ.1,31,84,181 ఆదాయం నమోదైందని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. ఇందులో విదేశీ కరెన్సీతో పాటు 230 గ్రాముల బంగారం, 1.450 కేజీల వెండి ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

తొలి రోజు ముగ్గురు

పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లు ప్రారంభం

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు తొలి రోజైన గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక్కోసెట్ నామినేషన్ వేశారు. మొత్తం ముగ్గురు అభ్యర్థులు మూడు సెట్ల నామినేషన్లు సమర్పించారని నల్లగొండ కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన తెలిపారు.

నేను పక్కా లోకల్ !



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను తిరస్కరించి.. కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఆ ఫలితాలే పార్లమెంట్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయి. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేకపోయారు. అయినా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు చేయడం తొందరపాటు చర్య. నా విజయానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి, పార్టీ నేతలు, కేడర్ కృషి చేస్తున్నారు. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండగా.. అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తా. నేను స్థానికేతరుడినని చెబుతున్న వారు మా స్వస్థలం కూసుమంచి మండలం చేగొమ్మగా గుర్తించాలి..' అని ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రఘురాం రెడ్డి వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

● ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన
● డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీ రేణుక, పార్టీ శ్రేణుల కృషితో గెలుస్తా..
● లోక్‌సభ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఫలితాలే రిపీట్
● మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌వి తొందరపాటు విమర్శలు

ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి

▸▸ ప్రజల నుంచి స్పందన బాగుంది..

గత నెల 25న నామినేషన్ వేసింది మొదలు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ప్రచారం చేస్తున్నాం. కార్యకర్తలతో భేటీ అవుతూ సభల్లో పాల్గొంటున్నాం. ఇప్పటి వరకు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తయింది. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈనెల 4న కొత్తగూడెంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారానికి వస్తున్నారు. దీంతో మాకు మరింత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది.

▸▸ కాంగ్రెస్‌కే పట్టం ఖాయం

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌కు తమ సత్తా చూపించారు. గత పదేళ్లలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉద్యోగ నియామకాలు, రైతులకు రూ.లక్ష రుణమాఫీ, పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఇక రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఏమైందో అందరం చూస్తున్నాం. ఉద్యోగ నియామక పరీక్షల పేపర్ లీకేజీలతో నిరుద్యోగులు ఇబ్బంది పడ్డారు. ఇక ఎమ్మెల్యేలు ప్రజలను అనేక విధాలుగా అవస్థ పెట్టారు. వీటితో విసిగిపోయిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు చెప్పారు. అదేమాదిరి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఫలితాలు వస్తాయి. దేశవ్యాప్తంగా శక్తివంతంగా తయారైన ఇండియా కూటమి.. సీపీఎం, సీపీఐ, ఇతర పార్టీలతో కలిసి ఎన్నికల్లో సత్తా చాటుతుంది.

▸▸ 150 రోజులకే ఉలుకెందుకు..

కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆయన పదేళ్లు పాలించి సమస్యలు పరిష్కరించలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం 150 రోజుల్లోనే ఆయనకు అంత ఉలుకెందుకు? కరెంట్ కోతలున్నాయని ఆరోపిస్తున్నారు. జిల్లా, రాష్ట్రంలో ఎక్కడా కరెంట్ ఇబ్బందులు లేవు. కావాలనే కేసీఆర్, ఆ పార్టీ శ్రేణులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే 65 లక్షల మంది రైతులకు రైతుబంధు ముట్టింది. మిగిలిన హామీలను కూడా మా ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది.

▸▸ అందరూ కలిసి వస్తున్నారు..

ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో అన్నిచోట్ల పర్యటించేలా షెడ్యూల్ తయారు చేసుకున్నాం. జిల్లాలో ముగ్గురు శక్తివంతమైన మంత్రులు ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎంపీ రేణుకాచౌదరి వస్తున్నారు. వీరితోపాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు ప్రచారంలో కలిసొస్తున్నారు. ఏళ్ల తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాముఖ్యత లభించింది. గతంలో జలగం వెంగళరావు ఉన్నప్పుడు ఇలా ఉండేది. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు.

▸▸ సమస్యల పరిష్కారంపై దృష్టి

నేను గెలవగానే లోక్‌సభ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తా. ఖమ్మంలో యూనివర్సిటీ మాత్రమే కాదు.. కొత్తగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్రియ విద్యాలయం కూడా లేదు. స్పాంజ్ ఐరన్ ఇండస్ట్రీ మూతపడింది. ఇక భద్రాచలం రోడ్–కొవ్వూరు రైల్వే లైన్ డిమాండ్ నెరవేరడం లేదు. కొత్తగూడెంలో విమానాశ్రయం.. ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకొచ్చి పనులు చేయిస్తా.

కాంగ్రెస్‌లో మూడు తరాలు

నేను స్థానికుడిని కాదని కొందరు విమర్శిస్తున్నారు. మాది కూసుమంచి మండలంలోని చేగొమ్మ. ఇక్కడ వ్యాపారాలు కూడా ఉన్నాయి. మా నాన్న నాలుగు సార్లు లోక్‌సభ, నాలుగు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. మా తాత ఉమ్మడి జిల్లాలో పార్టీ కోసం పనిచేశారు. అలా మూడు తరాలుగా మా కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో పాటు ఉమ్మడి జిల్లాతో అనుబంధం ఉంది. నేను గతంలో రాజ్యసభ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే టికెట్లు ఆశించినా కొన్ని కారణాలతో పోటీ చేయలేకపోయాను. ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా మంచి మెజార్టీతో గెలుస్తా.

నేటి నుంచి హోమ్ ఓటింగ్



ఈవీఎంల తనిఖీపై సూచనలు చేస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు శుక్రవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఉద్యోగులతో సమావేశమై మాట్లాడుతూ 85ఏళ్ల వయస్సు పైబడిన వారు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి ఓటు వేయించాలని సూచించారు. ఈ విషయమై ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, ఓటర్లు అందుబాటులో లేకపోతే రెండోసారి ముందస్తుగా సమాచారం ఇచ్చి వెళ్లాలని తెలిపారు. అలాగే, ఉద్యోగులు వారు విధులు నిర్వర్తించే చోట ఓటు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. కాగా, కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంలో అదనపు ఈవీఎంల మొదటి దశ తనిఖీని కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఖమ్మం లోక్‌సభ పరిధిలో 36మంది అభ్యర్థులు ఉండగా ఒకే కేంద్రానికి మూడు ఈవీఎంలు కేటాయించాల్సి ఉన్నందున అదనపు ఈవీఎంలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

అవగాహన తప్పనిసరి

ఎన్నికల ప్రక్రియపై సూక్ష్మ పరిశీలకులు పూర్తి అవగాహన పెంపొందించుకుని కీలకంగా వ్యవహరించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ డాక్టర్ సంజయ్ జి.కోల్టే సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటు చేసిన రెండో విడత శిక్షణలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ విజయనిర్మల, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, మాస్టర్ ట్రెయినీలు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్ పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మోడీ మళ్లొస్తే రాజ్యాంగంలో మార్పులు

● ఓటుతో బీజేపీ, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి
● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
● ఎన్నికల్లో సీపీఐ మద్దతు కోరిన మంత్రులు పొంగులేటి, తుమ్మల



చెప్పులపై కేంద్రం వేసిన జీఎస్టీ పెంచిందంటూ చెప్పు చూపిస్తూ మాట్లాడుతున్న నారాయణ, పక్కన అభ్యర్థి రఘురాంరెడ్డి, కూనంనేని తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధాని మోడీ కోరుతున్నట్లుగా ఈసారి ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగంలో మార్పులు జరగడమే కాక ఇక ప్రజాస్వామ్యం ఉండదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన సీపీఐ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నారాయణ మాట్లాడారు. బీజేపీ వ్యతిరేకులపై చట్టాన్ని ప్రయోగిస్తున్నారని, ఇప్పటికే ఇద్దరు ముఖ్యమంత్రులు జైలులో ఉండగా మూడో ముఖ్యమంత్రికి నోటీసు ఇచ్చారని తెలిపారు. మోడీ తనకు కుటుంబం లేదు, అవినీతి చేయనని చెబుతున్నా... ఆయన దత్తపుత్రులంతా అవినీతిపరులేనని చెప్పారు. పేదలు వేసుకుంటున్న చెప్పులపై 5 శాతం నుండి 18 శాతంకు జీఎస్టీ పెంచిన కేంద్రం.. కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తోందని విమర్శించారు. కాగా, కేసీఆర్ మాటలను జనం నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఈమేరకుఒక్క ఓటుతో బీఆర్‌ఎస్, బీజేపీకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉద్యమ ఖిల్లాలో ఇండియా కూటమికి ఎదురులేదని, కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయం ఖాయమని చెప్పారు. జాతీయ రాజకీయాల దృష్ట్యా కాంగ్రెస్‌ను బలపరుస్తున్నామని, దేశం కోసం గతంలో చేసిన త్యాగాల మాదిరిగానే ఇది కూడా ఒకటని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు ప్రత్యక్షమేనని.. నామ నాగేశ్వరరావు మంత్రి అవుతారని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎర్రజెండాల స్ఫూర్తితోనే రాజకీయాలు ప్రారంభించిన తాను ఆ స్ఫూర్తితోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. మతతత్వ బీజేపీని ఓడించేలా ప్రతీ ఓటు చేయి గుర్తుకు వేసేలా కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడగా.. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్.కే.సాబీర్ పాషా, నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సలీం, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచనలో పడ్డారు..

● బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి
● ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి/కూసుమంచి: రాష్ట్రంలో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ తీరుతో ప్రజలు ఆలోచనలో పడ్డారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌రావు తెలిపారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలను బీఆర్‌ఎస్ కార్యకర్తలు గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. తద్వారా బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయానికి పాటుపడాలని తెలిపారు. అనంతరం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ మరోమారు తన విజయానికి పార్టీ శ్రేణులు సహకరించాలని కోరారు. అలాగే, సాయంత్రం నేలకొండపల్లి, కూసుమంచిలో నిర్వహించిన రోడ్డుషోల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీలు విస్మరించడంపై నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ చేతిలో ప్రజలు మరోమారు మోసపోకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థి నామను గెలిపించాలని కోరారు. నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు బిడ్డనైనా తాను స్థానికంగా ఉంటానని. మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశాల్లో బీఆర్‌ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు, ప్రజాప్రతినిధులు శీలంశెట్టి వీరభద్రం, బుర్రి వెంకట్, పొన్నం వెంకటేశ్వర్లు, వెంకటరమణ, మోతారపు సుధాకర్, దోరేపల్లి శ్వేత, పగడాల శ్రీవి ద్య, వినయ్, పార్థసారథి, తాజుద్దీన్, ధనలక్ష్మి, నాగుబండి శ్రీనివాసరావు, కాసాని నాగేశ్వరరావు, తెల్లగొర్ల చిన్నలింగస్వామి, వేముల వీరయ్య పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో మాట్లాడుతున్న అభ్యర్థి నామ, పక్కన ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాల

రూ.60కోట్ల జరిమానా..

● మట్టి అక్రమ తవ్వకాలపై కన్నెర్ర
● 19 మంది గుర్తింపు.. 17మందికి పెనాల్టీ
● కోర్టును ఆశ్రయించిన పలువురు..



ఖమ్మం మెడికల్ కాలేజీకి కేటాయించిన ప్రాంతాన గతంలో చేపట్టిన మట్టి తవ్వకం (ఫైల్)

ఖమ్మంఅర్బన్: జిల్లాలో అనుమతులు లేకుండా, అనుమతి ఉన్నా పరిధి దాటి ఇబ్బడి ముబ్బడిగా మట్టితో పాటు స్టోన్ మెటల్ తవ్వకాలు చేపట్టిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పెద్ద ఎత్తున మైనింగ్ మాఫియా సాగిందని అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ అంశాన్ని ఎన్నికల ప్రచారంలోనూ అస్త్రంగా ఉపయోగించారు. తాము అధికారంలోకి రాగానే అక్రమాలను అరికట్టడమే కాక తవ్వకాలు చేపట్టిన వారి నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం వసూలు చేస్తామని చెప్పారు. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ విషయంపై దృష్టి సారించారు. ఈమేరకు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారంటూ జిల్లాలో 19 మందిని గుర్తించి 17 మందికి రూ.60 కోట్ల పెనాల్టీ చెల్లించాలని ఇటీవల మైనింగ్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, నోటీసులు అందుకున్న వారు తవ్వకాలతో తమకేం సంబంధం లేదని కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

తవ్వకాలకు బ్రేక్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఖమ్మం, పాలేరు ఎమ్మెల్యేలు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయగానే అక్రమ మైనింగ్ కట్టడిపై దృష్టి సారించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపే వరకు ఎక్కడికక్కడ తవ్వకాలు నిలిపివేయించాలని ఆదేశించారు. దీంతో తవ్వకాలకు నిలిపేసిన అధికారులు.. అక్రమాలకు పాల్పడినట్లు భావిస్తున్నట్లు 19మందికి నోటీసులు జారీ చేశారు. ఇందులో 17మందికి రూ.3కోట్లు, రూ.5కోట్లు, రూ.8కోట్లు ఇలా అందరికీ కలిపి రూ.60 కోట్ల మేర జరిమానా చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చారు. ప్రధానంగా జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న మండలాల్లోనే అత్యధికంగా మట్టి తవ్వకాలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిసింది. జిల్లాలో ఎన్ని క్వారీలు ఉన్నాయి, ఎంత మేర తవ్వకాలకు అనుమతి ఉంది.. అక్కడ ఏ మేరకు తవ్వకాలు చేపట్టి ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించారనే అంశంపై ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఈటీఎస్(ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) శాటిలైట్ సర్వే చేయించి అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారికి జరిమానా విధించారు. కొందరు అనుమతి తీసుకోకపోగా.. ఇంకొందరు అనుమతి తీసుకున్నా పరిమితికి మించి మట్టి తవ్వకాలు చేపట్టి భవన నిర్మాణాలు, రహదారులు, రియల్ వెంచర్లకు తరలించినట్లు గుర్తించారని తెలిసింది. అయితే, జరిమానా నోటీసులు అందుకున్న వారు మాత్రం తవ్వకాలు, అక్రమాలతో తమకేం సంబంధం లేదంటూ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఇక మైనింగ్ శాఖలో లోపాలను సరిదిద్దే క్రమాన ఏళ్లుగా పాతుకుపోయిన ఉద్యోగులను సైతం బదిలీ చేయడంతో విచారణ వేగంగా సాగింది.

గతంలో ఓ క్వారీకి రూ.16కోట్ల పెనాల్టీ

గతంలో రఘునాథపాలెం మండలం శివాయిగూడెం పువ్వాడనగర్ సమీపాన గుట్టపై అనుమతికి మించి తవ్వకాలు చేపట్టారని లీజ్‌దారులకు నాలుగేళ్ల క్రితం రూ.16 కోట్ల జరిమానా విధించారు. అయితే, లీజ్‌దారులు మాత్రం అనుమతి తీసుకున్న ప్రాంతంలోనే తవ్వకాలు చేపట్టామని, ఇతర ప్రాంతంతో తమకేం సంబంధం లేదని కోర్టును ఆశ్రయించగా.. ఆ కేసు కొనసాగుతోంది.

మూడింటికే అనుమతి

జిల్లా వ్యాప్తంగా మట్టి తవ్వకాలు కోసం మూడు మండలాల్లో మూడు క్వారీలకు మాత్రమే అనుమతి ఉంది. ఆ క్వారీలు కూడా ప్రభుత్వ భూముల్లోనే ఉన్నాయని మైనింగ్‌శాఖ అధికారులు చెపుతున్నారు. ఎర్రుపాలెం మండల రాజుపాలెం, రఘునాథపాలెం మండలం కోయచలక, ఖమ్మం రూరల్ మండలం అరెకోడులో క్వారీలు ఉండగా.. ఇంకా చాలా చోట్ల అనుమతి లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టారు. ఇటీవల రఘునాథపాలెం, బల్లేపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 43 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి కేటాయించారు. ఈ భూమిలోనూ కొన్నాళ్ల క్రితం మట్టి తవ్వకాలు చేపట్టగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమీక్షించి తవ్వకాలు చేపట్టిన వారితోనే గుంతలు పూడ్చించాలని సూచించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



అనుమతికి మించి తవ్వకాలు చేపట్టినా, అక్రమంగా మట్టి తవ్వకాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈటీఎస్ సర్వే ద్వారా అక్రమ తవ్వకాలు చేపట్టిన వారికి జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేశాం. ఇక ముందు ఎక్కడా ఇలాంటివి జరగకుండా పర్యవేక్షిస్తాం.

– ఆర్.సాయినాథ్, మైనింగ్ ఏడీ

కేసీఆర్ మాటలు నమ్మే పరిస్థితి లేదు..

● రాష్ట్ర మంత్రులు పొంగులేటి, తుమ్మల
● బీజేపీ, బీఆర్‌ఎస్‌ను పాతాళానికి తొక్కాలని పిలుపు
● జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రచారం

రఘునాథపాలెం/తిరుమలాయపాలెం/కారేపల్లి: పదేళ్లు అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోకుండా దోపిడీకి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని... కానీ ఆయన మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలో గురువారం రాత్రి నిర్వహించిన సమావేశంలో వారు ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇందిరమ్మ మనవడు రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయడం కోసం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. తద్వారా దేశంలోనూ ఇందిరమ్మ రాజ్యం ఏర్పడుతుందని తెలిపారు. అలాగే, తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం, కారేపల్లిలో నిర్వహించిన ప్రచార సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పంటలు ఎండాయని, కరెంటు పోయిందని కేసీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడడంతో ప్రాజెక్టు కుంగిపోయి సాగునీటి ఇబ్బందులు తలెత్తాయని, మరోపక్క వర్షాభావంతో ఇక్కట్లు ఎదురవగా కేసీఆర్ అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య రానివ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా బీజేపీ నేతలు బయ్యారానికి ఉక్కు ఫ్యాక్టరీ ఇస్తామని చెప్పి మోసం చేసినా ఆనాడు అధికారంలో ఉన్న కేసీఆర్ ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని ప్రశ్నించారు. ఈమేరకు ఈసారి బీజేపీ, బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పి కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని.. తద్వారా ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు పడతాయని తెలిపారు. అనంతరం అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ స్థానికుడైన తనను గెలిపిస్తే జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రుల సహకారంతో జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేలా దేలా కృషి చేస్తానని తెలిపారు.

కాగా, దమ్మాయిగూడెం సభలో కాంగ్రెస్ నాయకుడు నరేష్‌రెడ్డికి, మరో వర్గం నాయకుల మధ్య వాగ్వాదం జరగగా మంత్రి పొంగులేటి సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. ఈసమావేశాల్లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ మంగీలాల్‌తో పాటు నాయకులు స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ బుద్దా వంశీకృష్ణ, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, విజయాబాయి, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, ఇమ్మడి తిరుపతిరావు, ఆదెర్ల స్రవంతి, అజ్మీరా నరేష్, మల్లేల నాగేశ్వరరావు, అడ్డగోడ ఐలయ్య, మేదరి టోనీవీర ప్రతాప్, చరణ్‌రెడ్డి, మానుకొండ రాధాకిషోర్, గుత్తా వెంకటేశ్వర్లు, మలీదు జగన్, వాంకుడోతు విజయ దీపక్, నగేష్, వెంకటేశ్వరరావు, సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మంచుకొండ సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన మరో మంత్రి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థి రఘురాంరెడ్డి

క్లుప్తంగా

పతక విజేతలకు అభినందన



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మంస్పోర్ట్స్‌: కాకతీయ యూనివర్సిటీ జట్టు తరఫున ఆర్చరీ టోర్నీల్లో పాల్గొని ఆల్‌ ఇండియా స్థాయిలో పతకాలు సాధించి సత్తా చాటిన క్రీడాకారులను ఇటీవల యూనివర్సిటీ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ నేపథ్యాన క్రీడాకారులు పాయం లక్ష్మణ్‌, ఈ.సంపత్‌, వంశీ, అనిల్‌కుమార్‌ను శుక్రవారం ఖమ్మంలోని సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో అభినందించారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌, కోచ్‌ పాయం నగేశ్‌ పాల్గొన్నారు.

ఎక్సైజ్‌ స్టేషన్‌లో డీసీ తనిఖీ



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీసీ జనార్దన్‌రెడ్డి

ఖమ్మంక్రైం: ప్రొహిబిషన్‌, ఎక్సైజ్‌ ఖమ్మం–2 స్టేషన్‌ను గురువారం ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ జి.జనార్దన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌ రికార్డులను తనిఖీ చేసిన ఆయన కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. స్టేషన్‌ హౌజ్‌ ఆఫీసర్‌ బి.చంద్రమోహన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వేస్తే ఉచిత వైద్యం!

ఖమ్మంవైద్యవిభాగం: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటే రెండు నెలల పాటు కన్సల్టేషన్‌ ఫీజు ఉచితమని ఖమ్మంలోని శ్రీరక్ష హాస్పటల్‌ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఓటింగ్‌ శాతం పెంచేలా అధికారులు తీసుకుంటున్న చర్యలకు సహకరించేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 13న లోక్‌సభ, 27న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారికి రెండు నెలల పాటు ఉచిత కన్సల్టేషన్‌తోపాటు 'ఉయ్‌ ట్రీట్‌' ద్వారా ఏడాది పాటు ఉచిత టెలీ మెడిసిన్‌ వైద్యం అందించనున్నట్లు వెల్లడించారు.

డిగ్రీ కోర్సుల సెమిస్టర్‌ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధి డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్‌ పరీక్షల షెడ్యూల్‌ను గతంలో విడుదల చేయగా.. ఇందులో మార్పులు చేశారు. ఈ మేరకు కొత్త టైంటేబుల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్‌.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ తిరుమలాదేవి గురువారం విడుదల చేశారు.రెండో సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 6, 8, 10, 16, 18, 21, 25, 29వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. నాలుగో సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 7, 9, 15, 17, 20, 22, 28, 30వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటవరకు జరగనున్నాయి. అలాగే, ఆరో సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్‌ 7, 11, 12, 13వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హతం

- ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని బీజాపూర్‌ జిల్లాలో ఘటన

చర్ల: పోలీస్‌ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారనే నెపంతో ఇద్దరు గిరిజనులకు మావోయిస్టులు హతమార్చారు. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం బీజాపూర్‌ జిల్లా తెర్రెం పోలీస్‌స్టేషన్‌ పరిధి చుత్వాహి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. చుత్వాహి గ్రామానికి బుధవారం అర్ధరాత్రి వచ్చిన సుమారు 20 మంది మావోయిస్టులు నిద్రిస్తున్న మడవి ఉంగా, మడవి జోగాను లేపి శివారుకు తీసుకెళ్లి దారుణంగా నరికి చంపారు. ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందునే వీరిని హతమార్చామని, మరెవరైనా పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తే ఇదే పరిస్థితి ఎదురవుతుందని అక్కడ వదిలిన లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలో రెండు నెలల కాలంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో 88 మంది మావోయిస్టులు మృతి చెందగా.. ఇందుకు ఇన్‌ఫార్మర్లే కారణమంటూ మావోయిస్టులు ఈ దురాఘాతానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో బీజాపూర్‌ జిల్లాలోని అటవీ ప్రాంతాల గిరిజనులు భయంతో వణికిపోతున్నారు.

ఖమ్మం మార్కెట్‌ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,500
పెసలు	7,800	5,000
కందులు	11,050	10,300
మినుములు	7,600	7,600
బొబ్బెర్లు	7,800	7,800
మిర్చి	19,050	10,000
మిర్చి తాలు	9,800	8,000
పత్తి	7,100	4,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్‌ గెలలు

టన్ను ధర	రూ.14,229

రైళ్ల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

- కొన్నింటి రద్దు.. ఇంకొన్ని రైళ్లను దారి మళ్లించిన అధికారులు
- దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇక్కట్లు
- ప్రత్యేక రైళ్ల ఏర్పాటులో జాప్యం



ఖమ్మం రాపర్తినగర్‌: వేసవి సెలవుల్లో కుటుంబాలతో స్వస్థలాలకు, విహార యాత్రలకు, పుణ్యక్షేత్రాలకు రైళ్లలో వెళ్లాలనుకునే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. మూడో రైల్వే లైన్‌ నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసిన అధికారులు.. ఇంకొన్నింటిని దారి మళ్లించారు. దీంతో ప్రయాణికులు ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నారు.

ఎక్స్‌ప్రెస్‌లు రద్దు

జిల్లా మీదుగా వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించగా.. శాతవాహన, గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. దీంతో ప్రయాణం ఎలాగో తెలియక సతమతమవుతున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు ఎక్కువ ప్రయాణాలకు రైళ్లను ఆశ్రయిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లాపాపలతో వెళ్లాలనుకునే వారికి రైల్వే అధికారులు తీసుకున్న నిర్ణయం ఇబ్బంది కలిగిస్తోంది.

జనరల్‌ బోగీలు అంతంతే...

సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు ఎక్కువగా రైలు ప్రయాణంలో రిజర్వేషన్‌ చేయించుకోకుండా జనరల్‌ బోగీల్లో ప్రయాణిస్తారు. కానీ రద్దయిన రైళ్లు పోగా.. మిగతా వాటిలో ఒకటి, రెండు మినహా జనరల్‌ బోగీలు లేకపోవడంతో ఎండ, వడగాలుల నడుమ ప్రయాణానికి అవస్థ పడుతున్నారు.

స్పెషల్‌ ట్రైన్ల జాడేది?

ఏటా వేసవి కాలంలో రైల్వే శాఖ ప్రధాన ప్రాంతాలకు అనుసంధానం చేసేలా ప్రత్యేక రైళ్లను నడిపిస్తుంది. కానీ ఈ ఏడాది ప్రత్యేక రైళ్లను ఇంత వరకు ఏర్పాటుచేయలేదు. ఇకనైనా ప్రత్యేక రైళ్లను నడిపించడమే కాక ఎక్స్‌ప్రెస్‌లకు అదనంగా జనరల్‌ బోగీలు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

పతి కోసం సతి !

ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున ఆయన సతీమణి వినీల రావు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థి వినోద్‌రావు గురువారం ఉదయం ఖమ్మంలోని పటేల్‌ స్టేడియంలో డాక్టర్‌ గోంగూర వెంకటేశ్వర్లుతో కలిసి వాకింగ్‌ చేస్తూ వాకర్లను ఓట్లు అభ్యర్థించారు. అతర్వాత ఖమ్మం రూరల్‌ మండల కేంద్రంలో జరిగిన సభలోనూ పాల్గొన్నారు. ఇక వినోద్‌రావు సతీమణి వినీల ఖమ్మం 9, 53వ డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన ఆమె కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి వినోద్‌రావు గెలిపించాలని, తద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇక వినోద్‌రావు కుమారులు తాండ్ర వినీత్‌, వినయ్‌ సైతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు.

– ఖమ్మం మామిళ్లగూడెం



ఖమ్మంలో ప్రచారం చేస్తున్న వినోద్‌రావు సతీమణి వినీల

కలెక్టరేట్‌ నుంచే పర్యవేక్షణ

- చెక్‌పోస్టుల్లో తనిఖీలపై ఎప్పటికప్పుడు ఆరా
- టోల్‌ ఫ్రీ నంబర్‌, సీ – విజిల్‌ యాప్‌ ఫిర్యాదులపై స్పందన



కలెక్టరేట్‌ నుంచి పర్యవేక్షిస్తున్న సీపీఓ శ్రీనివాస్‌, జెడ్పీ సీఈఓ వినోద్‌ తదితరులు



సీసీ కెమెరాల పుటేజీ పరిశీలనకు ఏర్పాటుచేసిన టీవీలు

ఖమ్మం సహకారనగర్‌: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన కలెక్టరేట్‌లో గత నెల 16న కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేశారు. అదేరోజు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు ముమ్మరం చేశారు. అయితే, తనిఖీలను పరిశీలించడంతో పాటు ఉద్యోగులకు సూచనలు చేసేలా చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు బిగించి కలెక్టరేట్‌లోని కంట్రోల్‌ రూంకు అనుసంధానం చేశారు. ఈమేరకు ఉద్యోగులు మూడు షిఫ్టులుగావిధులు నిర్వర్తిస్తూ సంబంధింత బృందాలకు సూచనలు చేస్తున్నారు.

టోల్‌ ఫ్రీ నంబర్‌కు స్పందన

కలెక్టరేట్‌లోని కంట్రోల్‌ రూమ్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటి వరకు టోల్‌ఫ్రీ నంబర్‌ 1950కు 95 మంది ఫోన్‌ చేశారు. ఇందులో ఎక్కువగా ఓటు హక్కు ఎక్కడ ఉంది, ఓటు మార్పుకు చేసుకున్న దరఖాస్తుల వివరాలపై ఆరా తీస్తున్నారు. అలాగే, సీ–విజిల్‌ యాప్‌ ద్వారా 65ఫిర్యాదులు రాగా.. ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారు. కాగా, సీ–విజిల్‌కు పాత ఫొటోలు, వీడియోలు పంపించకుండా యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకున్న వారు లైవ్‌ లోకేషన్‌ ఆధారంగా అక్రమాలపై అప్పటికప్పుడు తీసిన ఫొటోలు, వీడియోలు పంపించాలని అధికారులు సూచిస్తున్నారు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోగా బృందాలు రంగంలోకి దిగుతాయని చెబుతున్నారు. ఈమేరకు నగదు, మద్యం, ఇతర ప్రలోభాలపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

అభ్యర్థి ఖర్చు.. రూ.95లక్షలు

ఖమ్మం సహకారనగర్‌: లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95లక్షల మేర ఖర్చు పెట్టేలా కేంద్ర ఎన్నికల సంఘం పరిమితి విధించింది. ఇంతకు మించి దాటకుండా అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. నామినేషన్‌ దాఖలు చేసిన నాటి నుంచి ఖర్చు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంక్‌లో కొత్త ఖాతా తెరిచి దీని ద్వారానే లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి ముప్పై రోజుల్లోగాఅభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి ఖర్చు చేసినా, లెక్కలు సమర్పించకున్నా అభ్యర్థి భవిష్యత్‌ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తారు. అభ్యర్థి చేసే ప్రతీ ఖర్చుకు సంబంధించి కేంద్ర ఎన్నిల సంఘం ధర నిర్ణయించింది.

ఈ ఎన్నికలు క్లిష్టమైనవి..

- ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీని ఓడించాలి
- ఖమ్మంలో కాంగ్రెస్‌ అభ్యర్థికి మద్దతు
- సీపీఐ (ఎంఎల్‌) మాస్‌లైన్‌ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన రఘురాంరెడ్డి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్‌: ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు చాలా క్లిష్టమైనవని, వీటిని సాధారణంగా తీసుకోవద్దని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. మతం పేరుతో ప్రజలను చీలుస్తూ, విద్వేషాలను రెచ్చగొడుతూ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తుందని తెలిపారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఉన్మాదం పెరగనున్నందున ఆ పార్టీని ఓడించడమే ధ్యేయంగా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో రంగారావు మాట్లాడుతూ గత లోక్‌సభ ఎన్నికల వరకు ఎవరికీ మద్దతు ఇవ్వకున్నా, ప్రస్తుతం పరిస్థితుల ఆధారంగా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ–బీఆర్‌ఎస్‌ను ఓడించాలని నినాదం ఇచ్చామని తెలిపారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పాటుపడుతున్నట్లు చెప్పారు. కాగా, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ అనుసరించిన విధానాలను కాంగ్రెస్‌ అనుసరించొద్దని సూచించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో అమాయకులపై అక్రమ కేసులు పెట్టించి వేధించారని, ఇప్పుడు కూడా కొన్నిచోట్ల అదే తరహాలో జరుగుతున్నందున తీరు మార్చుకోవాలని సూచించారు. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రామసహాయం రఘురాంరెడ్డికి మద్దతు ఇస్తున్నామని రంగారావు వెల్లడించారు. అనంతరం కాంగ్రెస్‌ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ తమ స్వగ్రామం చేగోమ్మ కాగా.. తన అత్తగారిది పిండిప్రోలు అని తెలిపారు. ఈమేరకు స్థానికుడినైన తనను గెలిపించాలని కోరారు. మాస్‌లైన్‌ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు రాయల చంద్రశేఖర్‌, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, నాయిని రాజు, ఆర్‌ శివలింగం, పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్‌, బందెల వెంకయ్య, కంకణాల అర్జున్‌రావు, కాంగ్రెస్‌ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, జావేద్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి



వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విధినిర్వహణలో విద్యుత్‌ ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఖమ్మం సర్కిల్‌ ఆపరేషన్స్‌ ఎస్‌ఈ సురేందర్‌ సూచించారు. ఈనెల 1వ తేదీన మొదలైన విద్యుత్‌ భద్రతా వారోత్సవాల వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్‌ ఉద్యోగులు, సిబ్బంది భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎర్త్‌ రాడ్‌, హెల్మెట్‌, గ్లౌజ్‌లు ఇతర పరికరాలు వెంట ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా చదివితే విజయం

విద్యార్థులను అభినందించిన కలెక్టర్‌ గౌతమ్‌



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ గౌతమ్‌

ఖమ్మం సహకారనగర్‌: ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ప్రణాళికాయుతంగా చదివితే విజయం సొంతమవుతుందని కలెక్టర్‌ వీ.పీ.గౌతమ్‌ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎస్సెస్సీలో 10 జీపీఏ సాధించిన 16మంది విద్యార్థును కలెక్టర్‌ గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అలాగే, పరీక్షలకు ఎలా సిద్ధమయ్యారు, కుటుంబ నేపథ్యం, భవిష్యత్‌ ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ సోమశేఖరశర్మ, సీఎంఓ రాజశేఖర్‌, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, ఆర్‌సీఓలు ప్రత్యూష, అంజలి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఇల్లెందు ఎమ్మెల్యే తండ్రి కన్నుమూత



పుల్లయ్య (ఫైల్‌)

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి కోరం పుల్లయ్య (95) గురువారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆరోగ్యం క్షీణించి టేకులపల్లి మండలం కోయగూడెంలోని స్వగృహంలో మృతి చెందారు. పుల్లయ్య భార్య సింగమ్మ కొన్నేళ్ల కిందటే మృతి చెందగా.. వీరికి కనకయ్య సహా ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, కోయగూడెంలో ఎమ్మెల్యే కనకయ్య తండ్రి మృతదేహం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, జెడ్పీ చైర్మన్‌ చంద్రశేఖర్‌, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు మువ్వా విజయ్‌బాబు, పిడమర్తి రవి, దిండిగల రాజేందర్‌, లక్కినేని సురేందర్‌రావు, విజయాబాయి, కోనేరు చిన్ని తదితరులు కూడా పుల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు.

పుల్లయ్య మృతికి సంతాపం

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మున్సిపల్‌ చైర్మన్‌ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్‌ చైర్మన్‌ జానీపాషా, కాంగ్రెస్‌ పట్టణ, మండల అధ్యక్షులు దానియేల్‌, పులి సైదులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, వివిధ పార్టీల నాయకులు జానీ, యదళ్లపల్లి అనసూర్య, కనగాల పేరయ్య, బంధం నాగయ్య, కె.సారయ్య, ఎస్‌ఏ నబీ, ముద్రగడ వంశీ, మడుగు సాంబమూర్తి, మేకల మల్లిబాబుయాదవ్‌, మూల మధూకర్‌రెడ్డి, మడత వెంకట్‌గౌడ్‌ సంతాపం ప్రకటించారు.

మర్లపాడులో అగ్నిప్రమాదం

వేంసూరు: మండలంలోని మర్లపాడు నుంచి కందుకూరు వెళ్లే మార్గంలోని ఎస్సీ కాలనీ సమీపాన గురువారం అగ్నిప్రమాదం జరిగింది. పంట పొలాల్లోని మొక్కజొన్న గడ్డికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోగా వడగాలులతో మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో పలువురు రైతుల పొలాల్లోని పంపుసెట్లు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం చైతన్యనగర్‌ రోడ్డు నంబర్‌–3 నుంచి బైపాస్‌ వైపు నడిచి వెళ్తున్న మహిళ నుంచి గుర్తు తెలియని వ్యక్తి గొలుసు లాక్కెళ్లాడు. చైతన్యనగర్‌కు చెందిన జ్యోతి బుధవారం రాత్రి నడిచి వెళ్తుండగా వెనక నుండి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. రూ.80వేల విలువైన గొలుసు చోరీపై బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అరచేతిలో సమగ్ర సమాచారం



ఖమ్మంసహకారనగర్‌: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడమే కాక ఓటర్లకు సులువుగా సమాచారాన్ని అందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా వివిధ రకాల యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తద్వారా ఓటరు ఎక్కడ నుంచైనా సెల్‌ఫోన్‌ ద్వారా పలు వివరాలు తెలుసుకునే వెసలుబాటు కలుగుతోంది. అంతేకాక పలు వెబ్‌సైట్ల ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చు. ఈ సందర్భంగా కొన్ని యాప్‌లు, వెబ్‌సైట్ల వివరాలు...

● ఓటరు హెల్ప్‌లైన్‌

ఎన్నికలు సమీపిస్తున్న క్రమాన ఓటరు జాబితాలో పేరు ఉందో, లేదో తెలుసుకునేందుకు అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఈమేరకు వివిధ వెబ్‌సైట్ల (voter.gov.in, ceotelangana.gov.in, nvsp.in, voterhelpline)ను ఏర్పాటుచేశారు. వీటిలో పేరు, ఫోన్‌ నంబర్‌, ఎపిక్‌ కార్డు నంబర్‌ తదితర ఆధారాల ప్రకారం జాబితాలో పేరు, ఉందా లేదా అని చూడడంతో పాటు పోలింగ్‌ బూత్‌ల వివరాలు కూడా తెలుసుకోవచ్చు. ఇంకా సులభంగా ఓటు వివరాలు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లోని కంట్రోల్‌ రూమ్‌ నంబర్‌ 1950 ఫోన్‌ చేయొచ్చు. ఈ టోల్‌ ఫ్రీ నెంబర్‌ నిరంతరాయంగా పనిచేస్తుంది.

● కేవైసీ యాప్‌

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను తెలుసుకోవాలంటే గతంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ఆండ్రాయిడ్‌ మొబైల్‌లో కేవైసీ(నో యువర్‌ క్యాండిడేట్‌) యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుంటే లోక్‌సభ బరిలో ఎందరు అభ్యర్థులు ఉన్నారో సులభంగా తెలుసుకోవచ్చు. అంతేకాక అభ్యర్థి విద్యార్హతలు, వారి నేరచరిత్ర, ఆస్తులు, అప్పులు ఇలా అన్ని వివరాలు తెలిసిపోతాయి.

● సక్షం యాప్‌

వృద్ధులు, దివ్యాంగుల కోసం సక్షం యాప్‌ అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలింగ్‌ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారు ఈ యాప్‌లో వివరాలు నమోదు చేసుకుంటే అధికారులు పరిశీలించి పోలింగ్‌ కేంద్రానికి రవాణా సౌకర్యం కల్పిస్తారు. అయితే, ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం అధికారులు వృద్ధులు, దివ్యాంగుల నుంచి ముందుగా దరఖాస్తులు స్వీకరించి హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించారు.

రహదారిపై విరిగి పడిన భారీ వృక్షం



చెట్టు విరిగిపడడంతో ఆగిన వాహనదారులు

చింతకాని: మండలంలోని తిరుమలాపురం క్రాస్‌ వద్ద ఖమ్మం–బోనకల్‌ ప్రధాన రహదారిపై గురువారం భారీ వృక్షం విరిగి పడింది. రహదారి పక్కన పొలాల్లోని మొక్కజొన్న చెత్తకు నిప్పంటించడంతో మంటలు చెట్లకు అంటుకుని భారీ వృక్షం విరిగిపడింది. ఆ సమయాన ఎలాంటి వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది. అయితే, రహదారిపై చెట్టు పడిపోవడంతో ఇరువైపులా గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఎస్సై నాగుల్‌ మీరా, సిబ్బందితో చేరుకుని జేసీబీ సాయంతో వృక్షాన్ని తొలగించాక ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

32 మందిపై బైండోవర్‌ కేసులు

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు 32 మందిపై పోలీసులు బైండోవర్‌ కేసులు నమోదు చేశారు. చేపల వేట విషయంలో రెండు వర్గాలుగా విడిపోవడంతో వివాదానికిదారి తీయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తొలుత పోలీసుస్టేషన్‌లో సభ్యులకు ఖమ్మం రూరల్‌ ఏసీపీ బీ.తిరుపతిరెడ్డి గురువారం కౌన్సెలింగ్‌ నిర్వహించారు. చేపల వేట విషయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.2 లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు.

లారీ బోల్తా.. క్లీనర్‌ మృతి

తల్లాడ: తల్లాడలో గురువారం తెల్లవారుజామున లారీ బోల్తాపడిన ఘటనలో క్లీనర్‌ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.. ఎర్రుపాలెం నుంచి భద్రాచలానికి సుబాబుల్‌ లోడ్‌తో లారీ అతివేగంగా వెళ్తుండగా.. తల్లాడ శివార్లలో రహదారిపై చనిపోయి పడి ఉన్న గేదెను తప్పించేందుకు డ్రైవర్‌ ప్రయత్నించాడు. ఈ క్రమంలో లారీ బోల్తా పడగా క్లీనర్‌, ఏపీలోని ఎన్టీఆర్‌ జిల్లా కంచికచర్లకు చెందిన బత్తుల రామయ్య(50) తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయన కుమారుడు వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లికి చెందిన వృద్ధుడు పూనాటి రామయ్య (83) గురువారం వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఆయన వడదెబ్బ బారిన పడగా మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. రామయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

మంగాపురంలో రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదె వద్ద రోదిస్తున్న మహిళ

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంలో రెండు గేదెలు ఆకస్మాత్తుగా మృతి చెందాయి. గ్రామానికి చెందిన భూక్యా సైదులు గేదెలు రోజు మాదిరిగా గురువారం మేతకు వెళ్లాయి. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాక ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాయి. పాడిపై ఆధారపడి జీవిస్తున్న సైదులు కుటుంబం ఈ ఘటనతో కన్నీరుమున్నీరుగా విలపించింది. ఇక మండలంలోని చెరువుమాధారంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో గురువారం ప్రమాదవశాత్తు నాలుగు గేదెలు పడ్డాయి. మేతకు వెళ్లిన సమయాన తాగునీటి కోసం వెళ్లి బావిలో పడినట్లు తెలుస్తోంది. ఈవిషయాన్ని గుర్తించే లోగా చీకటి పడడంతో బయటకు తీసేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు, మేక...

రఘునాథపాలెం: మండలంలోని పంగిడిలో తెగి పడిన విద్యుత్‌ తీగలను తాకడంతో షాక్‌కు గురైన ఎద్దు, మేక మృతి చెందాయి. ఇటీవల వచ్చిన ఈదురు గాలులతో గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో 11 కేవీ విద్యుత్‌ తీగ తెగిపడింది. అయినా సరఫరా నిలిపివేయకపోవడంతో గురువారం శంకర్‌కు చెందిన ఎద్దు, చిన్నాకు చెందిన మేక తీగను తాకగా షాక్‌ గురై మృతి చెందాయి. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు వివరాలు సేకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

Education

■మా వద్ద మాధ్యమ, సాహిత్యరత్న హిందీ పరీక్షలకై, SSC, ఇంటర్‌, డిగ్రీ, పి.జి., MBA, MCA, LLB, B.Tech, ఫామ్‌–బి, ఫామ్‌–డి, BSC నర్సింగ్‌, ANM, GNM, 2023-25 సం॥ B.Ed. కొరకు. సంప్ర॥ 7396250709, కోదాడ. [M-1185053]

Wanted

■ప్రముఖ కంపెనీలో పార్ట్‌ టైం మాన్యువల్‌ రైటింగ్‌ వర్క్‌ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్‌ 3500/– మీ పేరు, అడ్రస్‌ కాల్‌/ వాట్సప్‌ చేయగలరు. 9502615217. [M-1185061]

■విజయవాడలో పెద్దవారిని/బెడ్‌ పేషెంట్లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్‌ M/F ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 98850 25559 [B-043]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్‌

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9010299957, 9705444182

కొత్తగూడెం : 9010223783

ఫ్యాషన్

వేసవి వేడిమిని తట్టుకోవాలి,
కంఫర్ట్‌గా ఉండాలి
అదే టైమ్‌లో స్టైలిష్‌గానూ కనిపించాలి.
కాటన్ కుర్తీ పైకి బాందినీ,
చందేరీ, ఇకత్, సిల్క్ ఓవర్ కోట్లు
ఇప్పుడు బెస్ట్ ఛాయిస్‌గా ఉంటున్నాయి.
బోహోస్టైల్‌ని తలపిస్తూ, సమ్మర్ స్పెషల్‌గా ఉండే
ఈ స్టైల్ ఏ సందర్భానికైనా బాగా నప్పుతుంది.

కలర్‌ఫుల్‌గా.. కంఫర్టబుల్‌గా..



సంప్రదాయ వేడుకల్లో షిమ్మరీ లుక్ ఉండే లాంగ్ ఫ్రాక్స్, వాటి మీదకు సిల్క్ డిజైనర్ లాంగ్ ఓవర్ కోట్స్ ప్రత్యేకతను చూపుతాయి.



లాంగ్ ఫ్రాక్ లేదా లాంగ్ కుర్తీ ఈ స్టైల్‌కి ఎంచుకోవచ్చు. సౌకర్యాన్ని బట్టి స్లీవ్స్ లేదా స్లీవ్‌లెస్ టాప్స్‌ని సెలక్ట్ చేసుకోవాలి. కాటన్ కుర్తీ ఏ ఫ్యాబ్రిక్ అయినా ఫ్లోరల్స్‌లో లేదా భిన్నమైన ప్రింట్లు ఉన్న ఓవర్ కోట్స్ బాగా నప్పుతాయి. ఈ స్టైల్ డ్రెస్సింగ్ బోహో లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది. ఈ కాలానికి తగినట్టుగా ఫ్యాషన్ జ్యువెలరీ దీనికి సరైన ఎంపిక అవుతుంది.



ప్లెయిన్ డ్రెస్ ధరించినప్పుడు పూర్తి కాంట్రాస్ట్ ఓవర్ కోట్ వేసుకుంటే ఎక్కడ ఉన్నా స్పెషల్‌గా కనిపిస్తారు.

కాటన్ కుర్తీ–పైజామా మీదకు ఫ్లోరల్ ప్రింట్ ఉన్న కాటన్ ఓవర్‌కోట్‌ను ధరించవచ్చు. దుపట్టా అవసరం లేని ఈ స్టైల్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ సెట్ అవుతుంది.



లాంగ్ ఫ్రాక్‌కి అటాచ్ చేసినట్టుగా ఉండే ఫ్రాక్ స్టైల్ ఓవర్ కోట్ పార్టీలో స్టైలిష్ లుక్‌తో వెలిగిపోతుంది.



కాటన్ లాంగ్ కుర్తీకి ఇక్కత్ లాంగ్ ఓవర్ కోట్ ధరిస్తే ఉక్కబోతను, స్టైల్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చు.



సింపుల్ అండ్ గ్రేస్‌గా కనిపించే లుక్ టాప్ అండ్ బాటమ్‌కి ఫ్లోరల్ ఓవర్ లాంగ్ కోట్ సూపర్ స్టైలిష్ లుక్‌గా కనిపిస్తుంది.



సిల్క్ టాప్స్ అయినా ఈవెనింగ్ టైమ్‌కి ఓకే అనుకున్నవారు అదే కాంబినేషన్‌లో వచ్చే సిల్క్ ఓవర్ కోట్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.



ఓవర్‌కోట్‌లా అనిపించే లాంగ్ ఫ్రాక్ డ్రెస్‌ను కూడా ఈ స్టైల్‌కి ఎంపిక చేసుకోవచ్చు. సమ్మర్‌లో ఈవెనింగ్ పార్టీకి స్పెషల్ అట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు.

ఎక్స్‌పర్ట్

ఇప్పుడు డీప్‌ఫేక్‌ల వివాదం నడుస్తోంది.
ఎన్నికల సమయంలోనే కాదు
సర్వ కాలాల్లోనూ డీప్‌ఫేక్ వీడియోలు
ప్రముఖులకు పెద్ద సవాలు.
ఇక స్త్రీలకు ఇవి పీడగా పరిణమించాయి.
వీటి గుట్టుమట్లు ఏమిటో
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నీడలో
ఎలా జాగ్రత్తగా జీవించాలో తెలియచేస్తోంది
ఆ రంగంలో నిపుణురాలు మధుమితా ముర్గియా.

డీప్‌ఫేక్ గుట్టు ఆమెకు తెలుసు



మధుమితా ముర్గియా

‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో తయారయ్యే డీప్‌ఫేక్ వీడియోలు ఎంత కచ్చితంగా ఉంటాయంటే నిజమైనవా, అబద్ధమైనవా కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు. డీప్‌ఫేక్ వీడియోలు ఎవరినీ వదలవు. ప్రముఖులు వీటివల్ల అభాసుపాలు కావచ్చు. కాని మామూలు స్త్రీలు దీని బాధితులవుతారు. డీప్‌ఫేక్‌లో వీడియోను మార్ఫింగ్ చేయొచ్చు. అంటే మీరు పార్క్‌లో నడుస్తుంటే బీచ్‌లో నడుస్తున్నట్టుగా మార్చవచ్చు. దుస్తులతో ఉంటే దుస్తులు లేకుండా చేయొచ్చు. మరో పద్ధతి ‘ఇమేజ్ క్రియేటింగ్’. అంటే మీ వీడియో ఏమీ లేకపోయినా మీ ఇమేజ్‌ను పూర్తిగా సృష్టించి దానిని కావల్సినట్టుగా ఆడించవచ్చు. డీప్‌ఫేక్‌లో ఏ స్త్రీనైనా పోర్నోగ్రఫీ వీడియోలో ఉన్నట్టుగా భ్రమింపచేయవచ్చు. అదొక్కటే కాదు నిషేధిత సమయాల్లో నిషేధిత ప్రదేశాల్లో సంఘవ్యతిరేక శక్తుల మధ్య ఉన్నట్టుగా కూడా మిమ్మల్ని చూపొచ్చు. దీనికి అంతం లేదు. రాజకీయ ఉపన్యాసాలను డీప్‌ఫేక్‌తో మార్చి ఇబ్బంది పెట్టడం చాలా సులువు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ప్రమాదాలు అన్ని ఉన్నాయి. ఈ టెక్నాలజీ నాశనం అయ్యేది కాదు. మరింత పెరిగేది. దీని పట్ల ఎరుకతో ఉండటమే చేయగలిగింది’ అంటుంది మధుమితా ముర్గియా. ఆమె ఏ.ఐ. ఎక్స్‌పర్ట్.

బ్రిటిష్ ఇండియన్

ముంబైలో మూలాలు కలిగిన మధుమితా ముర్గియా లండన్‌లో పెరిగింది. అక్కడే చదువుకుంది. బయోలజిస్ట్‌గా, ఇమ్యూనాలజిస్ట్‌గా పని చేస్తూ టెక్ ఇండస్ట్రీ గురించి ఆసక్తి పెంచుకుంది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికకు ఏ.ఐ. ఎడిటర్‌గా పని చేస్తూ వ్యాపార ప్రయోజనాల కోసం మన డేటా ఎలా వాడబడుతున్నదో, చేతిలోని ఫోన్ వల్ల మన ప్రైవసీకి ఎలా భంగం కలుగుతున్నదో ఆమె ప్రపంచానికి తెలియచేస్తూ వస్తోంది. అంతేకాదు ఈ విషయాల గురించి ఆమె రాసిన తాజా పుస్తకం ‘కోడ్ డిపెండెంట్’కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. 2024 సంవత్సరానికి ఆమె బెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నలిస్ట్‌గా బ్రిటిష్ ప్రెస్ అవార్డ్‌ను గెలుచుకుంది.

ఏ.ఐ.తో మంచి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మూడు రంగాల్లో మంచి జరుగుతున్నదని అంటుంది మధుమిత. ‘ఆరోగ్య రంగంలో రిపోర్ట్‌ల ఆధారంగా పేషెంట్ వ్యాధిని ఏ.ఐ.తో గొప్ప స్పెషలిస్ట్ స్థాయిలో అంచనా కట్టొచ్చు. దీనివల్ల డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉండే బాధ తప్పింది. ఫార్మాసూటికల్ రంగంలో కూడా ఏ.ఐ సేవలు బాగా ఉపయోగపడతాయి. ఇక సైన్స్ రంగంలో చేయాల్సిన పరిశోధనలు సులువవుతాయి. విద్యా రంగంలో విద్యార్థుల రీసెర్చ్ కోసం ఏ.ఐ. ఉపయోగపడుతుంది. నేర పరిశోధనలో ఏ.ఐ.ని వాడి నేరస్తులను పట్టుకుంటున్నారు. ఇవన్నీ మంచి విషయాలే’ అంటుందామె.

చెడు ఎంతో ఉంది:

‘ఏ.ఐ. వల్ల రాబోయే ఐదేళ్లలో ఫొటోగ్రాఫర్లు అనేవాళ్లే లేకుండా పోవచ్చు. ఏ.ఐ. సహాయంతో ఎవరైనా సరే గొప్ప ఫొటోలు తీయవచ్చు. రచయితల బదులు ఏ.ఐ.తో కథలు రాయవచ్చు. కంప్యూటర్ల మీద జరగాల్సిన చాలా పనులు మనుషులు లేకుండానే జరిగే స్థితి రావచ్చు. దీనివల్ల లాభాలు సంస్థలకు వచ్చిన మనుషుల ఉనికి అంటే ఉద్యోగుల ఉనికి ఆందోళనలో పడుతుంది. చేతిలో ఫోన్ ఉంటే ఏ.ఐ. ద్వారా మీ ప్రతి కదలికను గుర్తించవచ్చు. మీరు ఇంట్లో ఉన్నా సురక్షితం కాదు. మీరు యాప్స్ ద్వారా కొనే వస్తువులను, మీరు వెళ్లే ఆస్పత్రులను, మీరు కొనే మందులను, వెళ్లే రెస్టరెంట్లను బట్టి రాబోయే కాలంలో మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించి మీ చేత ఏమేమి కొనిపించాలో మిమ్మల్ని ఎలా వినియోగదారునిగా మార్చాలో ఏ.ఐ. ఆయా కంపెనీలకు చెబుతుంది. గతంలో ఒక టెక్నాలజీని అనేక ఏళ్లు పరీక్షించి జనానికి మేలు కలిగే విధంగా వదిలేవారు. ఏ.ఐ. లాంటివి మంచి చెడ్డలు పరీక్షించకనే వదిలారు. అవి రోజు రోజుకూ శక్తి పుంజుకుంటున్నాయి. ఏ.ఐ. నుంచి తప్పించుకోలేము. అలాగని మరీ అంత భయం కూడా అక్కర్లేదు. మానవశక్తి, మానవ జ్ఞానం కృత్రిమ యాంత్రిక జ్ఞానం కంటే ఎప్పుడూ గొప్పవే’ అంటోంది మధుమిత.

వంటిల్లు

చల్ల కూరలు

మే నెల వచ్చేసింది... ఎండలు మండుతున్నాయి.
భోజనం చేయాలంటే చెమటలు పడుతున్నాయి.
కూరలను చూస్తేనే ఆకలి పోయి దాహం వేస్తోంది.
నేరుగా మజ్జిగలోకి వెళ్లాలనిపించేంత దాహం అది.
అందుకే పెరుగుతోనే కూరలు చేసుకుందాం.
ఇవన్నీ నాలుకకు హితవుగా ఉంటాయి.
తిన్న తర్వాత పొట్టను చల్లగా ఉంచుతాయి.

దహీ బైంగాన్



కావలసినవి: వంకాయ – 1 (మీడియం సైజు); నూనె – టేబుల్ స్పూన్ (వంటకు ఉపయోగించే నూనె ఏదైనా) ; ఆవనూనె – టేబుల్ స్పూన్ (పోపు కోసం) ; యాలకులు – 2 ; లవంగాలు – 2 ; పెరుగు – పావు లీటరు (చిలకాలి).
గ్రేవీ కోసం: మెంతిపిండి – టేబుల్ స్పూన్ ;అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; కశ్మీర్ మిర్చిపౌడర్ – టేబుల్ స్పూన్ ; నీరు – కప్పు (పై వన్నీ కలపడానికి) ; ఇంగువ– చిటికెడు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు – టీ స్పూన్.
తయారీ: ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి అందులో మెంతిపిండి, మిర్చిపౌడర్, అల్లం పేస్టు వేసి కలపాలి ● వంకాయను మందపాటి చక్రాల్లా తరిగి ఉప్పు రాయాలి ● నూనె వేడి చేసి వంకాయ ముక్కలను వేయించి పక్కన పెట్టాలి(ఎయిర్ ఫ్రయర్ ఉంటే నూనె లేకుండా ఫ్రై చేసుకోవచ్చు) ● అదే బాణలిలో మిగిలిన నూనెలో ఆవ నూనె వేసి వేడెక్కిన తర్వాత లవంగాలు, యాలకులు, ఇంగువ వేయాలి. ఇందులో మెంతిపిండి, అల్లం, మిరప్పొడి కలిపిన మిశ్రమం, పసుపు వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి ● ఆ మిశ్రమం వేడెక్కిన తర్వాత పెరుగు వేసి గరిటెతో కలుపుతూ ఐదారు నిమిషాల పాటు మరిగించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మరో కప్పు నీటిని పోసి కలిపితే చిక్కటి గ్రేవీ తయారవుతుంది. ఇప్పుడు ఉప్పు కలిపి గ్రేవీ చిక్కదనాన్ని సరిచూసుకుని అవసరమైతే మరికొన్ని నీటిని పోసి మరగనివ్వాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వంకాయ ముక్కలను వేసి కలిపి వడ్డించాలి. ఇది అన్నంలోకి రోటీకి కూడా మంచి కాంబినేషన్.

పులిస్సేరి



కావలసినవి: పెరుగు – పావు లీటరు ; పసుపు – పావు టీ స్పూన్ ; నీరు – పావు లీటరు.
కొబ్బరి పేస్టు కోసం: పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు ; పచ్చిమిర్చి– 3 ; జీలకర్ర– టీ స్పూన్; నీరు – కప్పు లేదా కొబ్బరి పేస్టు చేయడానికి తగినంత.
పోపు కోసం: నూనె – 2 టేబుల్ స్పూన్‌లు (వంటకు ఉపయోగించే కొబ్బరి నూనె లేదా ఇతర వంట నూనె) ; ఆవాలు – అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; మెంతులు– పావు టీ స్పూన్ ; ఎండుమిర్చి– 2 ; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు ; అల్లం – అర అంగుళం ముక్క (సన్నగా తరగాలి) ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర మిక్సీలో గ్రైండ్ చేయాలి. తగినంత నీటిని వేస్తూ మెత్తగా చేసుకోవాలి ● ఒక పాత్రలో పెరుగు, పసుపు, నీరు కలిపి చిలికి అందులో ఉప్పు, కొబ్బరి పేస్టు వేసి కలపాలి ● ఈ పాత్రను స్టవ్ మీద పెట్టి మీడియం మంటమీద మధ్యలో గరిటెతో కలుపుతూ వేడిచేయాలి. దీనిని ఎక్కువసేపు ఉడికించాల్సిన అవసరం లేదు. మరగడం మొదలైన వెంటనే దించేయాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం తరుగు వేసి చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తర్వాత పోపును ముందుగా వేడి చేసి సిద్ధంగా ఉంచిన పెరుగు– కొబ్బరి పేస్టు మిశ్రమంలో కలిపి, కొత్తిమీర చల్లి మూత పెట్టాలి. ఈ కేరళ వంట అన్నంలోకి రుచిగా ఉంటుంది.

గుజరాతీ కడీ



కావలసినవి: శనగపిండి– 4 టేబుల్ స్పూన్‌లు; అల్లం పచ్చిమిర్చి పేస్ట్– అర టేబుల్ స్పూన్ (అల్లం అంగుళం ముక్క, రెండు పచ్చిమిర్చి కలిపి గ్రైండ్ చేయాలి); తాజా పెరుగు – కప్పు ; బెల్లం లేదా చక్కెర – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నీరు – రెండున్నర కప్పులు.
పోపు కోసం: నూనె – టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర– అర టీ స్పూన్ ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; కరివేపాకు – ఒక రెమ్మ ; ఎండు మిర్చి – 2; మెంతులు – పావు టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, అల్లం–పచ్చిమిర్చి పేస్ట్, పెరుగు, బెల్లం, ఉప్పు వేసి బాగా చిలకాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి పేలిన తర్వాత జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, కరివేపాకు, ఎండు మిర్చి (విరిచి వేయాలి), మెంతులు, ఇంగువ వేసి దోరగా వేగిన తర్వాత స్టవ్ ఆపేయాలి. ఈ పోపును ముందుగా చిలికి పెట్టుకున్న పెరుగు – శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● ఇప్పుడు ఆ పాత్రను మీడియం మంట మీద ఉంచి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి కలుపుతూ మాడకుండా చూసుకోవాలి. శనగపిండి పచ్చి వాసన పోయిన తర్వాత మిశ్రమం మంచి రుచికరమైన వాసన వస్తుంటుంది. అప్పుడు కొత్తిమీర చల్లి దించేయాలి ● గుజరాతీ కడీని సూప్‌లాగ భోజనానికి ముందు తాగవచ్చు. అన్నంలో కలుపుకోవచ్చు, రోటీలోకి కూడా తినవచ్చు. ఇది వేసవి, శీతాకాలాల్లో కూడా ఆరోగ్యకరమైన ఆహారం.

కుకురార్



కావలసినవి: చికెన్ – అర కేజీ ; చిక్కటి పెరుగు – 5 టేబుల్ స్పూన్‌లు ; బంగాళ దుంప – 2 (ముక్కలుగా తరగాలి) ; అల్లం వెల్లుల్లి తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; ఉల్లిపాయలు – 3 (తరగాలి) ; ఆవ నూనె లేదా సాధారణ వంటనూనె – 5 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – చిటికెడు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి ; ఎండు మిర్చి– 5 ; పచ్చిమిర్చి– 3 (నిలువుగా చీరాలి) ; పసుపు – టీ స్పూన్ ; మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; గరం మసాలా పొడి – టీ స్పూన్ ; చికెన్ మసాలా పొడి– టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేయాలి. అందులో పసుపు, చికెన్ మసాలా పొడి, మిరప్పొడి వేసి మసాలా పొడులు చికెన్ ముక్కలకు బాగా పట్టేటట్లు కలిపి 20 నిమిషాల పాటు పక్కన ఉంచాలి ● ఈ లోపు ఒక బాణలిలో నూనె వేడి చేసి అందులో ఇంగువ, చక్కెర, ఎండు మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇవి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులోనే పెరుగు కూడా వేసి సమంగా కలిసేటట్లు ఒకసారి తిప్పి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన పెట్టాలి ● ఉల్లిపాయలు వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో బంగాళా దుంప ముక్కలు వేయించి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన ఉంచాలి. అదే బాణలిలో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేయించి తీసి పెట్టుకోవాలి ● ఇప్పుడు మిగిలిన నూనెలో మారినేట్ చేసిన చికెన్ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. చికెన్ ముక్కలు ఎర్రగా వచ్చేవరకు వేయించి అప్పుడు ఉప్పు వేసి ముక్కలకు పట్టేటట్లు కలపాలి. చికెన్ ముక్కల నుంచి నూనె వేరవుతున్న సమయంలో బంగాళాదుంప ముక్కలను వేయాలి. ఈ రెండింటినీ కలిపి పది నిమిషాల పాటు వేయించిన తర్వాత అందులో రెండు కప్పుల నీరు పోసి కలిపి మంట పెంచి ఉడకనివ్వాలి ● చికెన్ ఉడికేటప్పుడు అందులో ముందుగా వేయించి పెట్టుకున్న అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి తోపాటు గరం మసాలా పొడి, చిలికిన పెరుగు మిశ్రమాన్ని వేయాలి. ఇవన్నీ కలిసి ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర వేసి కలిపి దించేయాలి. ఈ కుకురార్ అస్సాం వాళ్ల వంట. అన్నం, రోటీల్లోకి రుచిగా ఉంటుంది.